ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 19.0
ANDHRAJYOTHY 3
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శనివారం 1 ఫిబ్రవరి 2025



పది విద్యార్థులకు
అల్పాహారం
- నేటి నుంచి ప్రారంభం
- 21,894 మందికి ప్రయోజనం

5



నిర్మలమ్మా.. కరుణించమ్మా



నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం



- రెండు రైల్వేలైన్లకు నిధులపై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు
- గద్వాల-డోర్నకల్, కృష్ణా-వికారాబాద్ ఎఫ్ఎల్ఎస్ పూర్తి
- ఈ రెండు లైన్లకు రూ.7,526 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు
- కేంద్రియ, నవోదయ విద్యాలయాల కోసం ప్రతిపాదనలు
- జాతీయ రహదారులు, శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు నిధులు అవసరం

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. బడ్జెట్‌లో పలు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ఉమ్మడి పాలమూరు ప్రజలు ప్రతీసారి భారీగా ఆశలు పెట్టుకుంటున్నప్పటికీ.. నిరాశే ఎదురవుతోంది. ఈసారైనా పలు ప్రాజెక్టులు, నూతన అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే భావనలో ప్రజలు ఉన్నారు. ప్రధానంగా పాలమూరు ప్రజలు కృష్ణా-వికారాబాద్, గద్వాల-డోర్నకల్ రైల్వేలైన్లకు నిధుల కేటాయింపును కోరుతున్నారు. ఇప్పటికే ఆ రైల్వేలైన్లకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) పూర్తి చేయగా, అంచనాలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా పూర్తి చేశారు. గత బడ్జెట్ సమయానికే ఇవి అందుబాటులోకి వచ్చినప్పటికీ.. ఆ సమయంలో కేటాయింపులు దక్కలేదు. అలాగే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు, సైనిక్ స్కూల్ ఏర్పాటు, గద్వాల జిల్లాలో చేనేత పార్కు, అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠం అయిన జోగుళాంబ ఆలయ అభివృద్ధి, జాతీయ రహదారులు, పంటలకు గిట్టుబాటు ధరలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, వేతన జీవులకు ఆదాయ పన్నులో ఊరట లభించాలని ఆశిస్తున్నారు. అలాగే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా లేదా కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయాలనే డిమాండ్ ఉంది. 2014 ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్రమోదీ జాతీయ హోదా ఇస్తామని ప్రకటించారు. తర్వాత దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ చేసినందునే జాతీయ హోదా ఇవ్వలేదని స్థానిక బీజేపీ నాయకులు చెబుతూ వచ్చారు. అయితే అత్యంత కీలకమైన ఈ



ప్రాజెక్టుకు నిధుల అవసరం చాలా ఉందనే చెప్పవచ్చు.

రెండు రైల్వే లైన్లపై ఆశలు..

పాలమూరు ఉమ్మడి జిల్లాలో కృష్ణా-వికారాబాద్, గద్వాల-డోర్నకల్ రైల్వేలైన్లకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీలు డీకే అరుణ, డాక్టర్ మల్లు రవి కూడా ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా ఇచ్చారు. ప్రస్తుతం సికింద్రాబాద్ మీదుగా రాయచూరుకు రైల్వేలైన్ ఉంది. ఈ దూరం దాదాపు 183 కిలోమీటర్లు. కాగా, ప్రతిపాదనలో ఉండి... ఎఫ్ఎల్ఎస్ పూర్తి

(మిగతా 4లో..)

పోటెత్తిన పల్లీ



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ రాశులు

- పాలమూరు మార్కెట్‌కు 11,153 క్వింటాళ్ల వేరుశనగ
- అధికంగా క్వింటాల్‌కు రూ.6,210 ధర
- కొనేందుకు చెన్నై, కర్ణాటక నుంచి తరలొస్తున్న వ్యాపారులు
- పాలమూరుతో పాటు ఇతర జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చి విక్రయం

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాలమూరు వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ పోటెత్తింది. మార్కెట్‌లో ఖాళీ స్థలం కనిపించనంతగా పల్లీ రాశులు పోశారు. మహబూబ్‌నగర్‌తోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు జిల్లా సరిహద్దున ఉన్న కర్ణాటక ప్రాంత గ్రామాల రైతులు కూడా మార్కెట్‌కు వేరుశనగ తెస్తున్నారు. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేయడం, గిట్టుబాటు ధర దక్కడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రోజూ ఐదు వేల క్వింటాళ్లకుపైగా వేరుశనగ వస్తోంది. శుక్రవారం 11,153 క్వింటాళ్ల వేరుశనగ మార్కెట్‌కు వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.6,783 కాగా, మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.6,210, అత్యల్పంగా రూ.3509 ధర పలికింది. ఈ నెల 14వ తేదీ నుంచి మార్కెట్‌కు వేరుశనగ రావడం ప్రారంభమైంది. 14న 80 క్వింటాళ్లు రాగా, 17న రెండు క్వింటాళ్లు వచ్చింది.

ఇతర ప్రాంతాల నుంచీ తెస్తున్న రైతులు

వేరుశనగ కొనుగోలు చేయడానికి మార్కెట్‌కు చెన్నై, కర్ణాటకల నుంచి వ్యాపారులు వస్తున్నారు. వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి రావడంతో పోటీ ఎక్కువై మద్దతు ధర బాగా వస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో క్వింటాల్‌కు గిట్టుబాటు ధర వచ్చింది. ప్రస్తుతం ఎగుమతి లేకపోవడంతో ధర కొంత తగ్గినా, ఈ సమయంలో ఈమాత్రం ధర పరువాలేదని రైతులు చెబుతున్నారు. జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి రైతులు వేరుశనగను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ నెల చివరి వరకు పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌కు పల్లీ అధికంగ రావటంతో కాంట చేసి లోడింగ్ చేసేవరకు రాత్రంతా సమయం పడుతోందని వ్యాపారులు చెబుతున్నారు.



సంచుల్లో నింపిన వేరుశనగ

మార్కెట్‌కు శనివారం సెలవు

మార్కెట్‌లో ధాన్యం దించటానికి స్థలం లేకపోవటంతో శనివారం సెలవు ప్రకటిస్తున్నట్లు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి జి.భాస్కర్ మీడియాకు తెలిపారు. ఆదివారం యధావిధిగా కొనుగోళ్లు చేపట్టనున్నట్లు చెప్పారు.

పాలమూరులోనే మంచి ధర

పాలమూరు మార్కెట్‌లో వ్యాపారులు ఎక్కువగా ఉండటంతో పోటీ పడి కొంటున్నారు. అందుకే మంచి ధర వస్తుంది. అందుకే ఏ పంటనైనా ఇక్కడికే తీసుకొచ్చి అమ్ముకుంటా.

- రైతు చెన్నయ్య, రెడ్డిపల్లి, గండ్వీడ్ మండలం

మంచి ధర

వ్యాపారులు కొన్ని వేరుశనగను ఇతర ప్రాంతాలకు అమ్ముకోవడం లేదని తెలిసింది. అయినా మహబూబ్‌నగర్ మార్కెట్‌లో పల్లీకి క్వింటాల్‌కు రూ.6,210 చొప్పున మంచి ధర వస్తోంది. తక్కువలో క్వింటాల్‌కు రూ.3,512 వస్తోంది. ఏ రోజు ధాన్యం ఆ రోజు కాంట చేసుకుని పంపిస్తున్నారు.

- రైతు వెంకట్‌రెడ్డి, ఖానీడు, కొత్తపల్లి మండలం

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ
- ఐదు తులాల బంగారం, 160 తులాల వెండి మాయం
- భూత్పూర్‌లో ఘటన

5

ప్రాణం తీసిన ప్రమాదం
- అన్న మృతి.. అపస్మారక స్థితిలో తమ్ముడు
- తల్లడిల్లిన కుటుంబం
- అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించిన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి..

4

తెలంగాణ ఉద్యమకారుల అవస్థలు
- మహబూబ్‌నగర్ కోర్టుకు 18 మంది హాజరు

5

ఎన్టీఆర్, ఎంవీఎస్
డిగ్రీ కళాశాలల దత్తత



సీఎంతో సమావేశమైన దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ముందుకొచ్చిన దేశ్‌పాండే ఫౌండేషన్
- హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ, ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలను దేశ్‌పాండే ఫౌండేషన్ దత్తత తీసుకునేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో ఫౌండేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రులతోపాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అమెరికాతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం దేశ్‌పాండే ఫౌండేషన్ పని చేస్తోందని సీఎంకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇవ్వడం, నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ రాష్ట్రంలో కస్తూర్బా బాలికల పాఠశాల నిర్వహణలో పాలుపంచుకుంటే బాగుంటుందని, అలాగే మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలను దత్తత తీసుకోవాలని కోరగా వాళ్లు అంగీకరించారని ఎమ్మెల్యే యెన్నం వెల్లడించారు. సీఎం సూచన మేరకు మహిళా విద్యాభివృద్ధి, సమగ్ర అధ్యయనం కోసం ఈనెల ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు హుబ్లీలో జరిగే కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే యెన్నం వెళ్లనున్నారు. కార్యక్రమంలో దేశ్‌పాండే వ్యవస్థాపకులు గురురాజ్ దేశ్‌పాండే, జయశ్రీ దేశ్‌పాండే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మి సుందరి

4న ఫిజియోథెరపీ కళాశాల భవనం ప్రారంభం
- హాజరుకానున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జనవరి 31: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి పక్కన కొత్తగా నిర్మించిన ఫిజియోథెరపీ నూతన కళాశాల భవనాన్ని ఈనెల నాల్గో తేదీన ప్రారంభించనున్నట్లు ఆంధ్రమహిళా సభ ఫిజియోథెరపీ కళాశాల కార్యదర్శి లక్ష్మీ సుందరి తెలిపారు. ఫిజియోథెరపి కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇదివరకు పాత భవనంలో కళాశాల కొనసాగేదని చెప్పారు. ప్రస్తుతం 115 మంది విద్యార్థులతో మూడు బ్యాచులు కొనసాగుతున్నాయన్నారు. భవనం పాతపడటంతో కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రభుత్వం రూ.2.05 కోట్లు మంజూరు చేసిందని, ఆ నిధులతో కొత్త కళాశాల భవనం పూర్తి చేశామన్నారు. కళాశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఫిజియోథెరపి కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ కార్తిక్, హైదరాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ ఛాయనందిని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు
రూ.కోటీ 25 లక్షలు మంజూరు
- రెండో విడత పాఠశాల, క్రీడల నిర్వహణకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం

నారాయణపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి గాను నారాయణపేట జిల్లాకు ప్రభుత్వ పాఠశాలలు, క్రీడల నిర్వహణకు రెండో విడుత మంజురు నిధులను చేసింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సమగ్ర శిక్ష అభియాన్ తెలంగాణ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 454 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా నిర్వహణ నిధులు రూ. 1,68,15,000, క్రీడల నిధులు రూ.41,15,000 కేటాయించారు. మొత్తం నిధుల్లో మొదటి విడతగా 50 శాతం రూ.2,09,30,000 గత సెప్టెంబరులో మంజూరు కాగా, మిగతా 50 శాతం రూ.1,04,65,000 రెండో విడుతగా తాజాగా మంజూరయ్యాయి. ఇందులో ఎస్సీ కాంపొనెంట్ 24 శాతం నిధులు రూ. 25,11,600 కాగా, ఎస్టీ కాంపొనెంట్ 14 శాతం రూ.14,65,100, జనరల్ కాంపొనెంట్ నిధులు రూ.64,88,300 ఉన్నాయి. క్రీడల నిర్వహణకు రెండో విడుత కింద రూ. 20,57,500 నిధులు విడుదల అయ్యాయి. స్కూల్ నిర్వహణ 50 శాతం నిధులతో పాటు క్రీడల నిధులు కలిపి రూ. 1,25,22,500 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం నిధులు సకాలంలో మంజూరు చేయడంతో పాఠశాల నిర్వహణతోపాటు స్టేషనరీ, వస్తువులు, జాతీయ పండుగల నిర్వహణ, క్రీడా సామగ్రి కొనుగోలు, ఆటలు ఆడించేందుకు ఊరట లభించిందని ఉపాధ్యాయులు అంటున్నారు.



పేట ప్రభుత్వ బాలికల పాఠశాల

కేటాయింపు ఇలా..

- పాఠశాలల గ్రాంట్స్ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒకటి నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తోంది. 31 నుంచి 100 మంది విద్యార్థులు ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 విద్యార్థులు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి 1,000 మంది విద్యార్థులు ఉంటే రూ.75 వేలు, వెయ్యి మందికిపైగా ఉంటే రూ.లక్ష నిధులను అందిస్తోంది.
- స్పోర్ట్స్ గ్రాంట్స్ ప్రాథమిక పాఠశాలకు రూ. ఐదువేలు ఇస్తోంది. ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.25 వేలు కేటాయిస్తోంది.

ఆపరేషన్ థియేటర్
ఎందుకు వాడుకోవడం లేదు?
- మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులపై కలెక్టర్ ఆగ్రహం




ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ థియేటర్ వాడకపోవడంపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అన్ని సౌకర్యాలు ఉన్నా థియేటర్‌ను ఎందుకు వాడుకోవడం లేదని వైద్యాధికారులను ప్రశ్నించారు. నారాయణపేట్, మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే దానిని వినియోగంలోకి తెచ్చి, ఇక్కడే ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు. థియేటర్ ముందు భాగంలో ఉంచిన మందులను వేరే గదిలోకి మార్చి, థియేటర్‌లోని పరికరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అన్ని పరీక్షలు, ఆపరేషన్లు ఇక్కడే చేయాలని, రెఫర్ అనే మాటే ఉండొద్దన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహించే డాక్టర్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు ఎంతమంది ఉన్నారని, విధులకు ఎప్పుడు వస్తున్నారని ఆరా తీశారు. ఏడుగురు డాక్టర్లు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సమన్వయ కర్త కలెక్టర్ వివరించారు. ఓపీ విభాగంలో రోగుల వివరాలను తెలుసుకున్నారు. మహిళ, పురుషుల, చిన్న పిల్లల వార్డులను పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

పది నెలల్లో 50 శాతమే..
- ఆస్తి పన్ను వసూలులో పాలమూరు నత్తనడక
- మిగిలింది రెండు నెలలే
- రూ.20.24 కోట్లకు.. రూ.10.92 కోట్లు మాత్రమే వసూలు
- స్పెషల్ పాలనలోనైనా వసూలయ్యేనా?

4



మహబూబ్‌నగర్ పట్టణం

నిర్మలమ్మా.. కరుణించమ్మా

(5వ పేజీ తరువాయి)

చేసుకున్న కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్ వల్ల ఆ దూరం 122 కిలో మీటర్లకు తగ్గుతుంది. వెనుకబాటులో ఉన్న కొడంగల్, నారాయణ పేట, మక్తల్ ప్రాంతాల్లో సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటై.. పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. దీనికి రూ.2,196 కోట్లతో అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి అందించారు. పార్ల మెంట్ ఎన్నికల సమయంలో కూడా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ అభ్యర్థులు ఈ రైల్వేలైన్‌ను ఎజెండాగా చేసుకున్నారు. అలాగే గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్‌కు రూ.7.40 కోట్లతో ఎఫ్ఎల్ఎస్ పూర్తి చేయగా.. మొత్తం 296 కిలోమీటర్ల దూరానికి రూ.5,330 కోట్లు అంచన వేశారు. గతంలో ఉన్న గద్వాల- మాచర్ల రైల్వేలైన్ అలైన్ మెంట్‌ను గద్వాల-డోర్నకల్‌గా మార్చారు. ఈ సర్వే కూడా పూర్తయ్యి దాదాపు సంవత్సరం అవుతోంది. గత బడ్జెట్‌లో నిధులు కేటాయించ లేదు. అలాగే సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ వరకు ఇప్పటికే డబ్లింగ్ పనులు పూర్తికాగా.. ఇటీవల ప్రధాని విశాఖ పర్యటన సందర్భంగా మహబూబ్‌నగర్- కర్నూలు డబ్లింగ్‌కు కూడా శంకుస్థాపన చేశారు. వాటికి నిధులు కేటాయించాల్సి ఉంది.



జాతీయ రహదారులపై ఆశలు..

ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో హైదరాబాద్- శ్రీశైలం, చించోలి, 44వ జాతీయ రహదారులు అందుబాటులో ఉన్నాయి. ఇంకా దూరభారం తగ్గించడానికి భూత్పూరు- శిరిగిరి పాడు, వనపర్తి- మంత్రాలయం, గద్వాల- రాయిచూర్ జాతీయ రహదారుల ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే హైదరాబాద్- బెంగళూరు మధ్య ఉన్న జాతీయ రహదారి 44పై ఇప్పటికే వాహనాల రాకపోకల శాతం భారీగా పెరిగింది. దాన్ని నాలుగు లైన్ల నుంచి ఎనిమిది లైన్లుగా మార్చాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే గత బడ్జెట్‌లో పెట్టిన హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిపై పారిశ్రామిక కారిడార్‌కు ఇప్పటి వరకు మోక్షం లభించ లేదు. శ్రీశైలం వెళ్లే దారిలో వన్యప్రాణులకు ఇబ్బంది కలుగకుండా ఉండటం కోసం ఎలివేటెడ్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని డీపీఆర్ కూడా సిద్ధం కాగా, భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. ప్రతీ జిల్లాకు ఒక కేంద్రీయ విద్యాలయం, నవోదయ పాఠశాల ఏర్పాటుకు గతంలో నుంచి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇటీవల మహబూబ్‌నగర్‌కు మాత్రమే నవోదయ పాఠశాల మంజూరైంది. నారాయణపేటలో సైనిక్ స్కూల్ ఏర్పాటు పట్టాలు ఎక్కలేదు. వీటన్నింటికీ ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పాలమూరు ప్రజలు కోరుతున్నారు. మరి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పద్దు పాలమూరు వాసుల్లో ఆశలు నింపుతుందా? లేదా ఎప్పటిలాగే నిరాశనే మిగిలిస్తుందా? అనేది చూడాలి.

జడ్చర్లలో వ్యభిచారం

- కేంద్రాలుగా మారిన లాడ్జీలు
- ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్న నిర్వాహకులు

జడ్చర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లలో వ్యభిచారం గుట్టుగా సాగుతోంది. పట్టణంలోని లాడ్జీలు అందుకు కేంద్రంగా మారాయి. రెండు జాతీయ రహదారుల కూడలిగా ఉన్న పట్టణంలో వ్యభిచారానికి లాడ్జీల నిర్వాహకులు ప్రత్యేక వెలుసుబాటు కల్పిస్తున్నారు. ఈ లాడ్జీలను అత్యధికంగా యువతీ, యువకులే వినియోగిస్తున్నారు. జడ్చర్ల క్రాస్‌రోడ్డుతో పాటు పట్టణంలో సుమారుగా 30 లాడ్జీలు ఉన్నాయి. కొన్ని లాడ్జీలు క్లాస్ మాదిరిగా ఉండగా, మరికొన్ని పూర్తి మాస్‌గా ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తాత్కాలికంగా ఉండేందుకు కొందరు లాడ్జీలను వినియోగిస్తే, మరికొందరు కేవలం వ్యభిచారానికి వినియోగిస్తున్నారు. జడ్చర్ల పట్టణంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన పట్టణాలలో ఈ దందా సాగుతోంది. మరికొందరు గృహాలను అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఇటీవల గద్వాల జిల్లాలో వ్యభిచారం నిర్వహిస్తున్న కేంద్రంపై పోలీసులు దాడులు చేసి, యువతులను, విటులను అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. గత ఏడాది జడ్చర్ల పట్టణంలో సైతం ఓ లాడ్జీలో వ్యభిచారం జరుగుతుందంటూ సమాచారం అందుకున్న పోలీసులు రైడ్ చేయగా, దాదాపు 10 జంటలు పట్టుబడ్డాయి. పట్టుబడిన వారిలో అత్యధికంగా యువతీ, యువకులే ఉన్నారు. వారిలోనూ కళాశాల విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఉండటం విశేషం.

రెట్టింపు అద్దె వసూలు

వ్యభిచారం నిర్వహించేందుకు కొందరు లాడ్జీ నిర్వాహకులు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నారు. లాడ్జీలో రూము తీసుకునే వారికి ఒక్క రోజు అద్దె ఎంత ఉంటుందో అంతకు రెండింతలు తీసుకుంటున్నారు. గదిని అద్దెకు ఇచ్చిన ట్లుగా రికార్డులలో ఎలాంటి ఎంట్రీలను నమోదు చేయడం లేదు. కొన్ని లాడ్జీలలో విటులకు మహిళలను సమకూర్చుతూ రెట్టింపు అద్దెతో పాటు వారి వద్ద కమీషన్ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని కొన్ని లాడ్జీలు కేవలం వ్యభిచారుల కోసమే నిర్వాహిస్తున్నట్లుగా మారాయి.

లాడ్జీలను లీజుకు తీసుకుని

రెండు జాతీయ రహదారుల కూడలిగా ఉన్న జడ్చర్ల పట్టణంలోని కొన్ని లాడ్జీలను యజమానుల నుంచి కొందరు లీజుకు తీసుకున్నారు. లీజుకు తీసుకున్న వారంతా వ్యభిచారం నిర్వహించే మహిళలకు అనుకూలంగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి. లాడ్జీలో అన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తుండడంతో సదరు మహిళలు, విటులు ఈ లాడ్జీలను వినియోగిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు జడ్చర్లలోని కొన్ని లాడ్జీలలో ఆన్‌లైన్‌లో గదులను బుక్ చేసుకుంటున్నారు. బుక్ చేసుకున్న గదికి ఎవరి కంట పడకుండ రాత్రికి వచ్చి, ఉదయమే వెళ్లిపోతున్నారు. గుట్టుగా వ్యభిచారం జరుగుతున్న లాడ్జీలపై పోలీసులు నిఘా పెట్టి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు జోరుగా కొనసాగుతోంది. శుక్రవారం వేలంలో పెద్ద సోనా గరిష్ఠంగా క్వింటాలుకు రూ.2,581, కనిష్ఠంగా రూ.2,560 ధర పలికింది. కందులు గరిష్ఠంగా రూ.7,286, కనిష్ఠంగా రూ.6,650 ధర పలికింది. పెద్ద సోనా ఎనిమిది క్వింటాళ్లు, కందులు 68 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

ఆధ్యాత్మికతను పెంచుకోవాలి

మూసాపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ప్రముఖ ప్రసంగీకులు నాగలక్ష్మి, డీకే ఆంజనేయులు అన్నారు. అడ్డాకుల మండలం చిన్నమునగాల్‌చేడ్ శివాంజనేయస్వామి దేవాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా పలు కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం చివరి రోజు కుంకుమార్చన, లలిత సహస్రనామం తదితర పూజలు చేశారు.

పది నెలల్లో 50 శాతమే

- ఆస్తి పన్ను వసూలులో పాలమూరు నత్తనడక
- మిగిలింది రెండు నెలలే
- ఈ ఏడాది రూ.20.24 కోట్లకు.. రూ.10.92 కోట్లు మాత్రమే వసూలు
- పాత బకాయి మరో రూ.26.49 కోట్లు
- మొత్తం బకాయి రూ.36.46 కోట్లు
- ప్రత్యేక అధికారుల పాలనలోనైనా వసూలయ్యేనా?



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం



మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలులో మహబూబ్‌నగర్ పురపాలిక వెనుకపడింది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం పది నెలలు ముగిసి, ఇంకా రెండు నెలలే సమయం ఉండగా ఇప్పటి వరకు కేవలం 50 శాతమే పన్ను వసూలు చేయడం గమనార్హం. పురపాలన ముగుస్తున్నందున అధికార యంత్రాంగమంతా అభివృద్ధి పనులపైనే నిమగ్నమైంది. చివరి రోజులు మరీ ఉరుకులు పరుగులుగా సాగింది. వార్డులలో పనులను గుర్తించడం, నిధులు కేటాయించడం, పనులకు శంకుస్థాపనలు చేయడం వంటి హడావుడితో పుర ఆదాయంపై దృష్టి సారించలేదన్న విషయం స్పష్టమవుతోంది. అభివృద్ధి పనులతోపాటు ప్రజలకు కావలసిన మౌలిక వసతులు కల్పించాలంటే ఆదాయం సమకూర్చుకోవడం కూడా ముఖ్యమే. పురపాలికకు ఆదాయం వచ్చే వనరుల్లో ఆస్తి పన్ను ప్రధానమైనది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 51,197 అసెస్‌మెంట్స్ ఉన్నాయి. వీటినుంచి ఏటా పన్నుల రూపంలో రూ.20.24 కోట్ల ఆదాయం వస్తోంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన పది నెలల కాలంలో రూ.10.92 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. మరో రూ.9.30 కోట్ల ఆస్తిపన్ను రావాల్సి ఉంటుంది. ఇందులో చాలామంది స్వచ్ఛందంగానే చెల్లిస్తుంటారు. చెల్లించని వారి వద్దకు సిబ్బంది వెళ్లి నయానో బయానో ఏటా వందశాతం వసూలు చేయాల్సి ఉంటుంది. అధికార యంత్రాంగం చేయాల్సిన ఈ పని చేయకపోవడం వల్ల వసూలు కావడం లేదు. దీనికి తోడు పాత బకాయిలు గుట్టల్లా పేరుకుపోతున్నాయి. పాత బకాయిలు అసలు రూ.13.39 కోట్లు కాగా, వడ్డీ రూ.15.75 కోట్లకు పెరిగింది. ఇందులో రూ.2.65 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఇంకా రూ.26.49 కోట్లు రావాల్సి ఉంది. అసలు, పాత బకాయిలు కలిపి మొత్తం రూ.36.46 కోట్లు రావాల్సి ఉంది.

అసలు కన్నా పెరుగుతున్న వడ్డీ

గడువులోగా పన్నులు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. గడువు ముగిసిన తరువాత ప్రతీనెల మొత్తం పన్నులో రెండు శాతం వడ్డీ వసూలు చేస్తారు. అయినా చెల్లించకుంటే వచ్చే నెల రెండు శాతం వడ్డీ అసలుకు జమై మళ్లీ ఆ మొత్తంపై రెండు శాతం వడ్డీ విధిస్తారు. ఇలా రెండు మూడేళ్లుగా పన్నులు చెల్లించకపోతే అసలుకన్నా వడ్డీ పెరిగిపోతుంది. ప్రస్తుతం పాలమూరులో బకాయిలు అసలుకన్నా వడ్డీనే పెరిగిపోయింది. పాత బకాయిల అసలు రూ.13.39 కోట్లు కాగా, దానిపై వడ్డీ రూ.15.75 కోట్లు ఉంది. ప్రభుత్వం అడ్వాన్స్ ఆస్తి పన్ను చెల్లించిన వారికి పన్నులోంచి ఐదు శాతం రాయితీ కూడా ఇస్తుంది. ఏటా రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నా చాలామంది చెల్లింపులకు ముందుకు రావడం లేదు. ఏప్రిల్‌లో చెల్లింపులు చేసిన వారికి రాయితీ వర్తించనుంది.

కౌన్సిలర్లతో పైరవీలు

పురపాలన సమయంలో పన్ను వసూలుపై అధికార యంత్రాంగం కొంత నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందన్న విషయం స్పష్టమవుతోంది. అధిక మొత్తంలో రావాల్సిన వ్యక్తి దగ్గరకు వెళ్తే.. అతను కౌన్సిలర్‌లతో పైరవీలు చేయించడం వల్ల అధికారులు వెనుకంజ వేసేవాళ్లు. ఇప్పుడు స్పెషల్ పాలన అమల్లోకి వచ్చినందున ప్రజాప్రతినిధుల ప్రభావం అంతగా ఉండే అవకాశం ఉండదు. ఈ సమయంలోనే యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, అసలు.. వడ్డీ వసూలు చేయాల్సిన అవసరం ఉంది. పురపాలిక అప్‌గ్రేడ్ అయి కార్పొరేషన్ అయినందున పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం మరింత నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత?

- కర్ణాటకకు తరలిస్తుండగా తప్పట్లమొర్సు శివారులో పట్టుకున్న పోలీసులు

గట్టు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. అక్రమంగా సేకరించిన బియ్యాన్ని తప్పట్లమొర్సు గ్రామంలో నిల్వ ఉంచి, వాహనంలో నింపి కొందరు కర్ణాటకకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో మాటు వేసి గ్రామ శివారులో వాహనాన్ని పట్టుకుని గట్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు 30 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల రాకను గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడని సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించాల్సి ఉన్నది.

మద్దతు ధరకే పత్తి కొనుగోలు


పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో కనీస మద్దతు ధర పత్తి సేకరణను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనసాగిస్తోందని చీఫ్ మేనేజర్ (మార్కెటింగ్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పత్తి రైతులందరికి, చివరి రాక వరకు అన్ని ఫెయిర్ గ్రేడ్ కొనుగోలు చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. ఏదైన సమస్య ఉంటే వాట్సాప్ నంబర్ 77189 55728కు సందేశం పంపవచ్చని పేర్కొన్నారు.

నేడు 'సౌత్ ఇండియా' షాపింగ్ మాల్ ప్రారంభం

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 39వ బ్రాంచ్‌ను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభిస్తున్నట్లు మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదురుగా కొత్తగా నిర్మించిన భవనంలో మాల్‌ను ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొలువుదీరిన ఈదమ్మ తల్లి

- ఆలయ పునర్నిర్మాణ మహోత్సవంలో ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠ
- గ్రామ దేవత దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు
- అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించి తొలి పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దంపతులు
- విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



కొల్లాపూర్‌లో కొలువుదీరిన భక్తులకు దర్శనమిస్తున్న ఈదమ్మ తల్లి

మహోత్సవాలకు హాజరైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, చిత్రంలో సురభి రాజా ఎస్‌వీకేకేబీ ఆదిత్య లక్ష్మారావు

కొల్లాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ పట్టణ ప్రజలను, పిల్లలను ఆపదల నుంచి రైతులను కాపాడిన కొల్లాపూర్ గ్రామ దేవత అభయ తల్లి ఈదమ్మ ఆలయం పునర్నిర్మాణ మహోత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను దేవాలయ పునర్నిర్మాణ కార్యనిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగాయి. హిందూ ధర్మ ఆగమ శాస్త్రం ప్రకారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శుక్రవారం ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వేద పండితులు మహా కుంభాభిషేకం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మ వారికి తొలి పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన అమ్మ వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని ఈదమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తమ తమ నివాస గృహాల్లో ఆడపడుచులకు ఒడిబియ్యం పెట్టుకుని భక్తిశ్రద్ధలతో అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామ దేవతలు ఎప్పుడు గ్రామాల్లో ఉండే ప్రజల బాగు కోసమే ఉంటారని, రైతులకు అండగా నిలుస్తారన్నారు. పురాతన ప్రాచీన మహిమ గల ఈదమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ వేడుకలను బీరం హర్షవర్ధన్ రెడ్డి నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆ అమ్మ వారి కరుణాకటాక్షాలు కొల్లాపూర్ ప్రజలకు రైతులకు ఎల్లప్పుడు ఉండాలని అమ్మ వారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు నమోదు

గద్వాల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మేలచెర్వు చౌరస్తాలో వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇందుకు మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరిగుతాయని, దీంతో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

సగానికి పైగా రైతుల్లో నిరాశ

- ప్రధాన మంత్రి ప్రకటన

- పీఎం కిసాన్ ఒకరికి మోదం.... మరొకరికి ఖేదం
- 2019 ఫిబ్రవరి నుంచి పాత వారికి తప్ప కొత్తవారికి అవకాశం లేదు
- గ్రామంలో సగానికి పైగా అందటం లేదంటున్న రైతులు



భూమ్‌పూర్‌లో మెట్ట భూమిని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

అయిజ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం రైతులకు ప్రకటించిన కానుక సగానికి పైగా రైతుల్లో నిరాశను రేకెత్తిస్తోంది. 2025 సంవత్సరం సందర్భంగా పీఎం కిసాన్ ఇక నుంచి రూ. 10,000 అని ప్రకటించారు. ప్రతీ రైతుకు కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ. 6,000లు అందచేసేది. ఇక నుంచి ఈ నూతన సంవత్సర కానుకగా రైతుకు సంవత్సరానికి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ ఖాతాలో ప్రకటించారు. 2019 ఫిబ్రవరి నుంచి పొలంతో సంబంధం లేకుండా ప్రతీ రైతు ఖాతాలో సంవత్సరానికి మూడు విడతలుగా రూ. ఆరు వేల చొప్పున పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కొంత మంది రైతులకు మాత్రమే మేలు చేకూర్చుతోంది. ఒక్కొక్క గ్రామంలో సగానికి పైగా రైతులకు అందటం లేదనే వాదన వినబడుతోంది.

మార్పులు, చేర్పులు లేవు

మార్పులు చేర్పులు లేని కారణంగా సగానికి పైగా రైతులు అర్హత ఉండి అనర్హులుగా మిగిలిపోతున్నారు. 2019 ఫిబ్రవరి వరకు మాత్రమే అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయం పన్ను చెల్లింపుదారులను ఇందులో నుంచి మినహాయించారు. వీరికి పొలం పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నప్పటికీ అనర్హులుగా ప్రకటించారు. ఇక ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తుల పేరిట భూములు ఉంటే అందులో ఒక్కరికి మాత్రమే అవకాశం కల్పించారు. పట్టాదారులో మార్పులు చేర్పులు జరిగితే వారికి అవకాశం లేకుండా పోతోంది. పట్టాదారు అవసరాల రీత్యా తన భూములను విక్రయిస్తే కొనుగోలు చేసిన రైతులకు అవకాశం ఇవ్వటం లేదు. ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ధరణి పేరుతో 2015 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం భూ ప్రక్షాళన చేపట్టింది. 2018 సంవత్సరంలో నూతన పట్టాదారు పాసు పుస్తకాలు అందచేసింది. 2019 ఫిబ్రవరి నాటికి చాలా మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందలేదు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అప్పటి భూముల వివరాలు అప్‌డేట్ కాలేదు. భూ రికార్డుల ప్రక్షాళనలో కొన్ని తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దే నాటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రెండు సంవత్సరాల సమయం పట్టింది. ఈ కారణాల చేత చాలా మంది రైతులకు 2019 ఫిబ్రవరి నాటికి చాలా మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న రైతుబంధు పథకంలో కొత్త రైతులకు అవకాశం కల్పిస్తున్నప్పటికీ కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఆ అవకాశం లేకుండా చేశారు. పాతవారికి సమ్మాన్ అందచేస్తూ కొత్త వారిని విస్మరిస్తున్నారు.

సగానికి పైగా తగ్గింపు

పథకం ప్రారంభంలో 2019 ఫిబ్రవరిలో మొదటి విడతగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 97,107 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వారికి రూ. 19,42,14,000లు వారి బ్యాంకు ఖాతాలో జమ అయింది. 18వ విడతకు వచ్చే సరికి 47,084 మంది రైతులుగా మిగిలారు. అంటే ప్రారంభంలో 91తో ప్రారంభం అయిన సీరియల్ నెంబర్ కాస్త 16వ విడతకు వచ్చే సరికి ఒక్కొక్క నెంబర్ కాస్త తగ్గుతూ వచ్చింది. 17వ విడతలో 70, 346 మంది రైతులు కాస్త 18వ విడతతో 47,084 మంది రైతులుగా మిగిలిపోయారు. ప్రారంభంలో 97,107 మంది రైతులు కాస్త 18వ విడతకు వచ్చే సరికి 47,084 మంది రైతులు మాత్రమే మిగిలారు. సగానికి పైగా 50,020 మంది రైతులను వివిధ కారణాల రీత్యా పీఎం కిసాన్ పథకం నుంచి తొలగించారు. వచ్చే ఫిబ్రవరిలో 19వ విడత రైతులకు అందించనుంది. అందులో మరో 15,000 మంది రైతులు తగ్గే అవకాశం ఉండవచ్చు అంటున్నారు. ఇలా పోతే చివరికి మిగిలేదు రైతులకు లబ్ధి శూన్యం అంటున్నారు.

సగం మంది రైతులకు అందటం లేదు



మా గ్రామంలో సగం మంది రైతులకు మోదీ రైతు డబ్బులు పడటం లేదు. ఐదు సంవత్సరాల నుంచి పాత వారికి తప్ప కొత్త వారికి అవకాశం ఇస్తలేదు. 2020 సంవత్సరంలో ఎకరా పొలం కొన్నాను. పట్టా బుక్కు ఉన్నప్పటికీ ఇస్తలేరు. రాష్ట్రం మాత్రమే అందుతుంది. ఇట్ల పట్టా మారినోళ్లు మా ఊళ్లో సగం మంది రైతులు ఉన్నారు. అందరికి అందిస్తే బాగుండు.

\- ఆంజనేయులు , రైతు, మేడికొండ

కొత్తవారికి అవకాశం కల్పించటం లేదు

2019 ఫిబ్రవరి వరకు మాత్రమే రైతులకు అందచేస్తోంది. కొత్త వారికి అవకాశం కల్పించటం లేదు. అలాంటి అవకాశం కల్పిస్తే రైతులకు సమాచారం అందిస్తాం.

\- సక్రియానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, గద్వాల

ప్రాణం తీసిన ప్రమాదం

- అన్న మృతి.. అపస్మారక స్థితిలో తమ్ముడు
- తల్లడిల్లిన కుటుంబం

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తెల్లవారుజామున మసక వెలుతురులో జరిగిన ప్రమాదంలో అన్న మరణించగా, తమ్ముడు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు... శుక్రవారం తెల్లవారుజామున మన్యంకొండ స్టేజీ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మహబూబ్‌నగర్ మండలం పోతన్‌పల్లికి చెందిన వెంకటయ్యకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. అంజి, కేశవులు అన్నదమ్ములు. కేశవులు గుంటూరులో పశువుల కాపరిగా పనిచేస్తుండగా, అన్న అంజి(22) గ్రామంలోనే వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మూడ్రోజుల క్రితం ఊరికి వచ్చిన కేశవులు శుక్రవారం తిరిగి గుంటూరు వెళ్లేందుకు పయనమయ్యాడు. పాలమూరులో తెల్లవారుజామున ముంబయి బస్సు ఉండటంతో ఉదయం 5 గంటలకు అంజి ద్విచక్రవాహనంపై తమ్ముడిని బస్సు ఎక్కించేందుకు పోతన్‌పల్లినుంచి బయలుదేరారు. రోడ్డుపైకి వచ్చి కొంతదూరం రాగానే మన్యంకొండ స్టేజీ దగ్గర గుర్తు తెలియని వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. అదే సమయం లో మక్తల్‌నుంచి హైదరాబాద్ వెళుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జరిగిన రోడ్డు ప్రమాదాన్ని చూసి చలించాడు. వెంటనే దిగి 108 అంబులెన్స్ సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చే వరకు అక్కడే ఉండి క్షతగాత్రులను ఎక్కించేందుకు సాయం పట్టాడు. వాళ్ల వెళ్లిపోయాక ఎమ్మెల్యే అక్కడినుంచి వెళ్లిపోయారు. అయితే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగానే అంజి మార్గమధ్యంలోనే చనిపోయాడు. కేశవులు ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరు కొడుకులలో ఓ కొడుకు చనిపోవడం, మరో కొడుకు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్లాడుతుండటంతో కుటుంబం తల్లడిల్లింది. తండ్రి వెంకటయ్య రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అంజి(ఫైల్)

వృద్ధులకు న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సీనియర్ సిటిజన్స్, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పించి వారికి తగిన న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యుల సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వృద్ధుల సంక్షేమానికి తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 సహా అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. వాటిపై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆ చట్టం ద్వారా వృద్ధులకు తగిన న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. వృద్ధులకు, ఏదైనా సమస్యలు వస్తే టోల్ ఫ్రీ నంబర్ 14567ను సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లాలోని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో ఎంతమంది వృద్ధులు ఉన్నారనే వివరా లను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన సీనియర్ సిటిజన్స్ తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వనపర్తిలో నడుపుతున్న వృద్ధాశ్రమానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 60 ఏళ్ల పైబడిన వారికి సీనియర్ సిటిజన్ కార్డుల మంజూరుకై జిల్లా సంక్షేమ అధికారికి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, డీఆర్‌డీవో ఉమాదేవి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, విలేజ్ ఇన్ పార్ట్‌నర్ షిప్ ఎన్జీవో అధ్యక్షులు నాగేంద్ర స్వామి, సీనియర్ సిటిజన్స్, తదితరులు పాల్గొన్నారు.

పేదల తిరుపతి
దేవుని తిర్మలాపురం

» నాలుగు వందల ఏళ్ల చరిత్ర కలిగిన వేంకటేశ్వర ఆలయం

» ఆరు నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు




వేంకటేశ్వర స్వామి ఆలయం, కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

పెద్దకొత్తపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పేదల తిరుపతిగా పేరుగాంచిన దేవుని తిర్మలాపురంలో ఈనెల ఆరవ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి భక్తుల పూజలు అందుకుంటున్నారు. నాలుగు వందల ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయం ఉన్న ఈ క్షేత్రంలో ప్రతీ సంవత్సరం మాఘ మాసంలో ఆరు నుంచి 14వ తేదీ వరకు, తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

11న కల్యాణం, 12న రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు ఈనెల ఆరున ఉదయం అభిషేకం, అలంకరణ, సాయంత్రం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఏడున ఉదయం ధ్వజారోహణం, పల్లకీసేవ, సాయంత్రం గజవాహన సేవ ఉంటాయి. ఎనిమిదిన ఉదయం పల్లకిసేవ, సాయంత్రం శేష వాహన సేవ, తొమ్మిదిన హనుమంతు వాహన సేవ నిర్వహిస్తారు. 10న గరుడ వాహనసేవ, 11న ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం ప్రభవాహన సేవ, 12న రాత్రి ఎనిమిది గంటలకు రథోత్సవం, ఉంటాయి. 13న ఉదయం చక్రస్నానం, సాయంత్రం అశ్వవాహన సేవ, 14న తీర్థావళి, హంస వాహన సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని వసతులు కల్పించాం. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

- వి.సత్యం, సర్పంచు, దేవుని తిర్మలాపూర్

నేటి నుంచి అంజన్న బ్రహ్మోత్సవాలు

» చింతరేవులలో రెండున తెప్పోత్సవం, మూడున రథోత్సవం




చింతరేవుల అభయాంజనేయ స్వామి దేవాలయం, మూలవిరాట్

ధరూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని పెద్దచింతరేవుల గ్రామంలో ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి చేశామని వ్యవస్థాపక వంశీయులు సి.గిరిరావు, కార్యనిర్వాహణాధికారి సి.కవిత శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. తొలి రోజు శనివారం అంకురార్పణ, ధ్వజా రోహణం, రెండున ఉదయం స్వామివారి ఉపన యనం, రాత్రి ఎనిమిది గంటలకు తెప్పో త్సవం, పల్లకీసేవ, ప్రభోత్సవం నిర్వహిస్తారు. మూడున రాత్రి పది గంటలకు రథోత్సవం, నాలుగున ప్రభోత్సవం ఉంటాయి. ఐదవ తేదీన స్వామివారికి అవభృధ స్నానం, ఆరున మధ్య నవమి ఉత్సవం, ఏడవ తేదీన పల్లకీ సేవతో బ్రహోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. తొలిరోజు అంకురార్పణ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు.

గజవాహనంపై ఆంజనేయుడు

» కొనసాగుతున్న ఊర్కొండ పేట బ్రహ్మోత్సవాలు



గజవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

ఊర్కొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం, ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారిని గజవాహన సేవ నిర్వహించారు. అంతకుముందు అర్చకులు దత్తాత్రేయశర్మ, మహేశ్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక వ్రతాలు నిర్వహిం చారు. క్షేత్రంలో వెలసిన మిఠాయి, గాజులు, చిన్న పిల్లల ఆట వస్తువులు, వంట సామగ్రి దుకాణాలు భక్తులతో సందడిగా మారాయి. పూజా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది మారుతీరావు, వరలక్ష్మి, శ్రీశైలం పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి టోర్నీలో
రన్నర్‌గా జిల్లా బాలికల జట్టు



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టుతో నిర్వాహకులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా, తుప్రాన్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్య దర్శి శారదాబాయి జట్టు క్రీడాకారిణులను, కోచ్ మేనేజర్లు రాఘవేందర్, నాగరాజులను అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా..
ఆదర్శ బోధన

» ఆంగ్ల మాధ్యమంలో మెరుగైన విద్యనందిస్తున్న తెలంగాణ ఆదర్శ పాఠశాలలు

» ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న గ్రామీణ విద్యార్థులు » ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

» ఈనెల 28 వరకు దరఖాస్తుల స్వీకరణ » ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష

ఖిల్లాఘణపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అంగ్ల మాధ్యమంలో మెరుగైన విద్యను అందిస్తున్నాయి. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో విద్యాబోధన కొనసాగుతోంది. 10వ తరగతి తర్వాత మెరిట్ ప్రకారం ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అవకాశం ఉంటుంది. వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘణపురం, కొత్తకోట, పెబ్బేరు మాండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, మెరిట్ ప్రకారం, రిజర్వేషన్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతీ సంవత్సరం ఆరవ తరగతిలో వంద మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. మొత్తంగా 10వ తరగతి వరకు 500 మంది విద్యార్థులు ఉంటారు. 2025 - 26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి జనవరి ఆరున దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయ్యింది. ఈ నెల 28 వరకు అవకాశం ఉంటుంది.

ఆధునాతన వసతులు

ఆదర్శ పాఠశాలల్లో పక్కా భవనాలతో పాటు విశాలమైన తరగతి గదులు ఉన్నాయి. ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వృత్తి విద్యకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను ఉచితంగా అందిస్తున్నారు. ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు అకాడమిక్ విద్యతో



దొంతికుంట తండా ఆదర్శ పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్



ఖిల్లాఘణపురంలోని ఆదర్శ పాఠశాల భవనం

పాటు ఎంసెట్, నీట్‌కు సంబంధించిన శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న 100 బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉంటుంది.

స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం

ప్రవేశాలలో స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఆ తరువాత ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ప్రవేశ పరీక్షలో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్ల పాఠ్యాంశాలపై 25 మార్కుల చొప్పున ఐచ్ఛిక తరహాలో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ షీట్లల్లో గుర్తించాల్సి ఉంటుంది. విద్యార్థులు సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు.

ప్రతిభ చాటుతున్న విద్యార్థులు

ఆదర్శ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ప్రతిభ చాటుతున్నారు. పదవ తరగతి పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. పోటీ పరీక్షల్లోనూ రాణిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు నీట్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ తదితర పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ, ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందుతున్నారు. చదువుతో పాటు జాతీయ స్థాయి క్రీడల్లో సైతం ప్రతిభ కనబరుస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన



విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నాం. ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. మా విద్యార్థులు కోచింగ్ అవసరం లేకుండా ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధిస్తున్నారు.

- ఉమాదేవి, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, ఖిల్లాఘణపురం

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బోనఫైడ్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మీ సేవ కేంద్రాలు, ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, జనరల్ విద్యార్థులకు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు సంబంధించిన హార్డ్ కాపీని సంబంధిత ఆదర్శ పాఠశాలల్లో సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆరవ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఏడు నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం రెండు నుంచి, నాలుగు గంటల వరకు ఆయా పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఆరవ తరగతిలో వంద సీట్లు, ఏడు నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం » 21,894 మందికి ప్రయోజనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలకు సిద్ధం అవుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం అందించనున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఉదయం వేళ ఇంట్లో టిఫిన్ చేసి ప్రత్యేక తరగతులకు వస్తారు. మధ్యాహ్నం పాఠశాలలోనే భోజనం చేస్తారు. కానీ సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే దూర ప్రాంత విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం అందించాలని నిర్ణయించింది. ఈ నెల ఒకటి నుంచి మార్చి 20వ తేదీ వరకు అమలు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతీ విద్యార్థికి రోజుకు రూ. 15

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 533 ప్రభుత్వ పాఠశాలల్లో 21,894 మంది పదవ తరగతి చదువుతున్నారు. వారికి గత ఏడాది నవంబరు మొదటి వారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారికి సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించేందుకు ప్రతీ విద్యార్థికి రోజుకు రూ. 15 చొప్పున 38 రోజులకు రూ. 570 రూపాయలు ఖర్చు చేయనున్నారు. అందుకోసం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా నిధులు కేటాయించారు. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నిధులతో పాటు ప్రతీ విద్యార్థికి రోజుకు ఐదు రూపాయలు అదనంగా కేటాయిస్తున్నారు. అందుకోసం కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి 24 రోజులకు సంబంధించి రూ. 7.5 లక్షలు విడుదల చేశారు.

మొత్తంగా విద్యార్థికి రూ. 20 చొప్పున ఖర్చు చేసి అల్పాహారం ఇవ్వనున్నారు. ఎస్‌ఎంసీల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉడికించిన శెనగలు, పల్లీలు, పెసర్లు, ఉల్లిపాయ పకోడి, మిల్లెట్ బిస్కెట్లు, బెల్లం పట్టీలు అందించనున్నారు.

జిల్లాల వారీగా మంజూరైన నిధులు

జిల్లా	విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.)
మహబూబ్‌నగర్	5,810	33,11,700
నారాయణపేట	4,358	24,84,060
నాగర్‌కర్నూల్	4,758	27,12,060
జోగులాంబ గద్వాల	3,623	20,65,110
వనపర్తి	3,345	19,06,650
మొత్తం	21,894	1,24,79,580

ప్రతీ విద్యార్థి హాజరు కావాలి



ప్రత్యేక తరగతులకు ప్రతీ విద్యార్థి హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు శనివారం నుంచి అల్పాహారం అందించనున్నాం. అందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి.

- ఎ.ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

తెలంగాణ ఉద్యమకారుల అవస్థలు

» మహబూబ్‌నగర్ కోర్టుకు హాజరైన 18 మంది

» కేసులు కొట్టివేయించాలని ప్రభుత్వానికి వినతి



మహబూబ్‌నగర్ కోర్టుకు హాజరైన ఉద్యమకారులు

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక రాష్ట్ర సాధనకు కదం తొక్కిన ఉద్యమకారులపై నమోదైన కేసులను ఇప్పటి వరకు ఎత్తివేయక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న కొందరు, స్నేహితుల సహాయంతో కోర్టుకు హాజరు కావాల్సి వచ్చింది. ఉద్యమకారులపై నమోదైన కేసులన్నింటినీ ఎత్తివేశామని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఒక కేసులో పెండింగ్ ఉన్నట్లు 2022లో పోలీసులు గుర్తించి సమన్లు జారీ చేశారు. అవి గత ఏడాది చివర్లో ఉద్యమకారులకు అందాయి. దీంతో 18 మంది ఉద్యమకారులు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. వారిలో కొందరు 72 ఏళ్ల వయసు వారు నడవలేని స్థితిలో అతి కష్టం మీద కోర్టుకు వచ్చారు. ఈ కేసులో ఉన్న ఐదుగురిని పోలీసులు నేటికీ గుర్తించకపోవడం గమనార్హం. ప్రభుత్వం చొరవ తీసుకొని కేసును కొట్టివేయించాలని వారు కోరుతున్నారు. కోర్టుకు హాజరైన వారిలో టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రానాయక్, చంద్రకాంత్ రెడ్డి, బాలరాజు, చంద్రకళ, శివరత్నమ్మ, పుష్ప, నర్సింహారెడ్డి, డేవిడ్, రవికుమార్, జావేద్ తదితరులున్నారు.

పాలెం విద్యార్థినుల
పొలం బాట

» కొత్త మొల్గరలో పంటల పరిశీలన

» సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



వరి నారును పరిశీలిస్తున్న విద్యార్థినులు

భూత్పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థినులు పొలం బాట పట్టా రు. డాట్ కో-ఆర్డినేటర్, ప్రొఫెసర్ భరత్ భూషణ్ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థినులు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, కొత్తమొల్గరలో పర్య టించారు. రైతులు సాగు చేసిన పంటలు, వరి నారును పరిశీలించారు. వరి సాగులో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కాండం తొలుచు పురుగు నివారణ పద్ధతులను వివరించారు. కార్యక్ర మంలో విద్యార్థినులు దివ్యశ్రీ, శ్రీయభావన, సాయిచరిత, హైమావతి, జాహ్నవి, రష్మిత పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు

ఆత్మకూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా పుష్కరాల సందర్భంగా 2016, జూలై 15న మహబూబ్ నగర్ పట్టణంలోని టీడీ గుట్ట ప్రాంతానికి చెందిన హరిప్రకాష్, స్నేహితుడు రాఘ వేందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జూరాల ప్రాజెక్టుకు బయ లు దేరాడు. ఆత్మకూరు నుంచి కొత్తకోట వైపు వెళ్తున్న ట్రాక్టర్ చెరువు కట్టపై వారి వాహనాన్ని ఢీకొన్నది. ప్రమాదంలో హరిప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నిందితుడైన ట్రాక్టర్ డ్రైవర్ ఎం.నాగేశ్‌ను శుక్రవారం ఆత్మకూరు కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో అతడికి 18 నెలల జైలు శిక్ష, ర. 1500 జరిమానా విధిస్తూ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయా ధికారి వై.జానకి తీర్పు వెల్లడించారు.

యువకుడిపై పోక్సో కేసు

చారకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండల కేంద్రానికి చెందిన యువకుడు మహేశ్‌గౌడ్ ప్రేమ పేరుతో ఓ బాలికను వేధించాడు. బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇబ్బంది పెట్టాడు. ఈ విషయంపై బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

» ఐదు తులాల బంగారం, 160 తులాల వెండి మాయం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, క్యూస్ టీం సభ్యులు

భూత్పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారం ఎత్తుకెళ్లారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీలో ఈ సంఘటన జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావులపల్లికి చెందిన వెంకటయ్య భూత్పూర్ పట్టణంలో నివసిస్తున్నారు. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు సహా గద్వాలకు వెళ్లాడు. అదే రోజు రాత్రి దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తలుపులు విరగ్గొట్టి అందులోని ఐదు తులాల బంగారం, 160 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో జరిగిన ఈ సంఘటన సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. మరుసటి రోజు వచ్చిన వెంకటయ్య, ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ చంద్రశేఖర్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలు సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించాయి. జాగిలం చోరీ జరిగిన ఇంటి నుంచి అదే కాలనీలోని చర్చి దగ్గరకు వెళ్లి ఆగిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాలో కోత విధిస్తున్నట్లు రూరల్ ఏడీఈ మద్దిలేటి, సీఅండ్‌వో ఏఈ సి.నర్సిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్తంభాల తొలగింపు, కొత్త స్థంభాల బిగింపు పనులు ఉండటంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు తెలిపారు. క్రిస్టియన్‌పల్లి, అయోధ్యనగర్, మధురానగర్, భూలక్ష్మి, జెపీఎన్‌ఈఎస్ కళాశాల పరిధిలో సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రతి విద్యార్థికి చదవడం రావాలి

కోయిలకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఎంఈవో వెంకట్‌జీ అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య పై అశ్రద్ధ వహించవద్దని తెలిపారు. ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు విద్యార్థులకు పలు అంశాలతో చదవడానికి వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ

జడ్చర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పకాలనీలో బొడ్ల విజయ్ కుమార్, ద్యాసమోని కృష్ణయ్యల ఆధ్వర్యంలో శుక్రవారం ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో కాలనీ అంతా మార్మోగింది. శివమాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం

కోయిలకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏబీవీపీ నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో పారుపల్లి శ్వేతా విద్యామందిర్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ నరేందర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్ బహుమతులను అందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

జడ్చర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సదాశివయ్య ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో చెట్లకు పాదులు చేసి నీరు పట్టారు. ఏపుగా పెరిగిన కలుపు మొక్కలను తీసేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే వ్యాధుల బారినుంచి రక్షించుకోగలమని అధికారి తెలిపారు.

'ఆడపిల్లలను చదివించాలి'

హన్వాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదువుకు దూరం చేయకుండా, వారిని ఉన్నత చదువులు చదివించాలని శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం అన్నారు. శుక్రవారం మండలంలోని మునిమోక్షం గ్రామంలో బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం-1 మొక్కలను నాటారు. సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ సునీత, యాదమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

జడ్చర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ సహకారంతో ఫాక్సన్ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ముందుకు వచ్చారంటూ వైస్ ప్రిన్సిపాల్ నర్మద తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 110 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, వినయ్‌లు ఇంటర్వ్యూ తీసుకుని, రెండు రోజుల్లో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ అధికారి నాగలక్ష్మి, మెంటర్ ప్రతాప్, ప్లేస్‌మెంట్ అధికారి రాఘవేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, డాక్టర్ సులేమాన్, డాక్టర్ నరసింహారావు, మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

గండీడ్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్ర ప్రతిభ పరీక్షను మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యార్థులకు శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి తరుణ్, ద్వితీయ బహుమతి లక్ష్మణ్, తృతీయ బహుమతి పవిత్ర గెలుపొందినట్లు ఎంఈవో జనార్దన్ తెలిపారు. తిరుపతయ్య, రాధిక, గోవిందు పాల్గొన్నారు.

'రియల్' రంగాన్ని ఆదుకోవాలి

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ కుదేలైందని, ప్రభుత్వం ఆదుకోవాలని రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అన్సార్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లా కొంపల్లి బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని తెలిపారు. కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

మెరుగైన విద్యను అందించాలి

» అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్


మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, గురుకుల పాఠశాల ఆర్‌సీవోలు, డీసీవోలతో సమీక్ష నిర్వహించారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా మెనూ అమలు చేయాలన్నారు. వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్నవి పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహాల వద్ద మురుగు నిల్వకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. అత్యవసర మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు సోమవారంలోగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో ప్రవీణ్ కుమార్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి, గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రునాయక్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులను సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల సమావేశ మందిరంలో రెండురోజుల పాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన కెరియర్ గైడెన్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పదో తరగతి పిల్లలను పరీక్షలకు ఎలా సిద్ధం చేయాలో అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా పదో తరగతి పూర్తయిన తర్వాత ఏం చదవాలన్న దానిపై కూడా విద్యార్థులకు తెలియజేయాలన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాసేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు.

కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ మొరజుల్లాఖాన్, ఏఎంవో శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

» ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలి

» కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కార్పొరేషన్ పరిధిలో అనుమతి లేకుండా చేస్తున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని స్పెషల్ ఆఫీసర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. పట్టణంలోని వార్డు ఆఫీసర్లు పర్యటించి నోటీసులు జారీ చేయాలన్నారు. ఆస్తిపన్ను వంద శాతం పూర్తి చేయాలని దీనిపై అందరూ దృష్టి సారించాలన్నారు. ఆస్తిపన్ను వసూలు సగం కూడా పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటితో పాటు దుకాణాల అద్దెలు, బకాయిలు వసూలు చేసి ఆదాయం పెంచుకోవాలన్నారు. సమావేశంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌వో ఖాజామైనొద్దీన్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్ చేసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం 2020లో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తులకు ఆహ్వానించిందని, వీరిలో చాలా మంది దరఖాస్తులను అధికారులు ఇప్పటికే పరిశీలించి వాటిని ఫీజు ఎంత చెల్లించాలో నిర్ణయించడం జరిగిందన్నారు. క్లియర్ చేసిన దరఖాస్తు వివరాలను ఇప్పటికే మునిసి పాలిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో పొందుపరిచామన్నారు. వివరాలు తీసుకుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మార్చి 31 వరకు చెల్లింపులు చేసుకున్న వారికి 2020 ప్రకారంగా ఫీజులు ఉంటాయని, ఆ తరువాత స్కీం గడువు పూర్తవుతుందన్నారు.

మన్యంకొండ ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 7న ప్రారంభం కానుండగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ధర్మకర్త అలహరి మధుసూదన్ ఉన్నారు.

నేడు బాదేపల్లి మార్కెట్‌కు సెలవు

జడ్చర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి మార్కెట్‌లో వేరుశనగ నిల్వలు అధికమవడంతో మార్కెట్‌కు శనివారం సెలవు ప్రకటిస్తున్నట్లు చైర్‌పర్సన్ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో సుమారు 48వేల బస్తాలు విక్రయానికి రైతులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. మార్కెట్‌కు శుక్రవారం 449 మంది రైతులు వేరుశనగను సుమారు 6,568 క్వింటాళ్లను విక్రయానికి తీసుకొచ్చారు. క్వింటాల్ గరిష్టంగా రూ.6,229, కనిష్టంగా రూ.4,009, మాడల్ ధరగా రూ.5,348 పలికింది.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చలో హైదరాబాద్‌కు ఎస్సీలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సువార్తమ్మ, కావలి కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్ ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 7న లక్ష డప్పులు, వేల గొంతులు నినాదంతో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు, ప్రభాకర్, శ్రీరాములు, కాన్షీరాం, రామచంద్రయ్య, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

పాలమూరు యూనివర్సిటీ: లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ దరువు ఎల్లన్న, డాక్టర్ నల్లిగంటి శరత్ అన్నారు.శుక్రవారం సన్నాహక కార్యక్రమంలో భాగంగా పీయూలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ర్యాలీ నిర్వహిచారు.

శాలువాల పంపిణీ

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హజ్రతే సయ్యదా జైనబ్ అలైహిసలాం జయంతిని పురస్కరించుకొని గులేమానే ఆహ్లెబైత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల-3 పాఠశాలలో విద్యార్థులకు ప్రార్థనా శాలువాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. సయ్యద్ జైనబ్ స్ఫూర్తితో బాలికలు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ, మీర్‌షోయబ్‌అలీ, జహంగీర్‌పాషఖాద్రీ, అమీర్, ఫారుఖ్, రహెమాన్, పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థి ప్రతిభ

మూసాపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మూసాపేట జిల్లా పరిషత్ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి బికళ రెండో స్థానం సాధించారు. దీంతో శుక్రవారం పాఠశాలలో ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, పీఈటీ సుగుణ, ఉపాధ్యాయులు, యువజన సంఘం సభ్యులు ముక్తార్, అర్షద్, ఆరీఫ్ అభినందించారు.

రేపు బీసీ రాజకీయ యుద్ధభేరి

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీ రాజకీయ యుద్ధభేరికి తరలిరావాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి యం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిజాలాపూర్‌కు కేఎల్‌ఐ సాగునీరు

మూసాపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాలాపూర్ గ్రామానికి కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు రావడం లేదని ఇటీవల గ్రామస్థులు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే సంబంధితశాఖ అధికారులకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం ఖిల్లాఘనపూర్ మండలం మామిడిమాడ ముందరితండా వద్ద కేఎల్ఐ కాల్వను ఎక్స్‌కవేటర్‌తో నీటి పారుదలశాఖ ఏఈ వెంకటేశ్వర్లు తవ్వించి నిజాలాపూర్ వైపు నీరు వచ్చేలా చేశారు.

'వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలి'

పాలమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని సీనియర్ న్యాయవాది కుర్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో వాల్మీకి సంఘం-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా న్యాయవాది బెక్కెం జనార్దన్, కృష్ణ ముదిరాజు, మైత్రి యాదయ్య పలువురు హాజరై ప్రసంగించారు. వాల్మీకులు రాష్ట్రంలో ఒక విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒకలా గుర్తించటం సరికాదన్నారు. పెన్ను, పేపర్ లేని రోజుల్లోనే దేశానికి గొప్ప రామాయణ చరిత్ర గ్రంథాన్ని వాల్మీకి మహర్షి అందించారని గుర్తుచేశారు. ఎర్రం నరసింహ, సతీష్, పోలీసు నర్సింహ, అల్లన్న, రంగన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం


మహబూబ్‌నగర్‌లో లలిత సహస్ర నామాలు ఆలపిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని బ్రహ్మణవాడిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో లలిత సహస్ర నామాలు, కీర్తనలు, భజనలు నిర్వహించారు.

జడ్చర్ల: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి యజ్ఞం చేసి, మహిళలకు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అమ్మవారి పారాయణం చేసిన అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. పట్టణంలోని సకలదేవతల ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా గౌరీ, గణపతి పూజలు, పుణ్యాహావచనము, గోమాతపూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష ఫల పంచామృతాభిషేకం చేశారు.

కోయిలకొండ: మండల కేంద్రంలోని గౌని ఆంజనేయస్వామి ఆలయంలో మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు కావాలి


ప్రదర్శనను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

భూత్పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు కావాలని ఎంఈవో ఉషారాణి అన్నారు. మునిసిపాలిటీ కేంద్రంలోని న్యూఎరా పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంఈవో, రిషి విద్యాసంస్థల అధినేత వెంకటయ్య, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వంశీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు తిలకించడానికి రానున్నరని కరస్పాండెంట్ క్రాంతికుమార్ వివరించారు.

ఎల్‌వోసీల అందజేత

నవాబ్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్లూరుకు చెందిన భాస్కర్, కాకర్‌జాలకు చెందిన అబ్దుల్‌కు రూ.60వేల విలువ చేసే రెండు ఎల్‌వోసీలను శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు దుష్యంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, దేపల్లి వెంకటేశ్‌గౌడ్, నవాజ్‌రెడ్డి, వాజీద్‌మహేఖ్, రవీందర్‌రెడ్డి, అమీద్ తదితరులు పాల్గొన్నారు.

కుట్ర దారులను అరెస్ట్ చేయాలి

బాలానగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తనను హత్య చేయడానికి కుట్ర పన్నిన వ్యక్తులను అరెస్టు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ శ్రీనివాస్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో నివాసం ఏర్పాటు చేసుకోని స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తూ జీవతం గడుపుతున్నానని తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులకు జనవరి 27న, ఎస్పీకి 28న చేసినట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ

నవాబ్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మాడ పుష్పలత ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమె రచించిన ఆరవ రచన కవిత పుష్పాలు పుస్తకాన్ని శుక్రవారం చిగిచెర్లకృష్ణారెడ్డి, పొద్దుటూరి ఎల్లారెడ్డి, రావుసూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

నగరపాలక సంస్థగా బోర్డు మార్పు



ప్రధాన ద్వారం వద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా మారిన బోర్డు

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ కార్పొరేషన్‌గా అవతరించింది. ప్రభుత్వం ఇందుకు సంబంధించి గెజిట్, జీవోలను కూడా విడుదల చేయడంతో ప్రక్రియ షురూ అయ్యింది. ప్రస్తుతం ఉన్న మునిసిపల్ కార్యాలయంపై ఉన్న పేరును శుక్రవారం తొలగించి మహబూబ్‌నగర్ నగర పాలకసంస్థగా రాశారు. దీంతోపాటు సరిహద్దులైన అప్పన్నపల్లి శివారు, దివిటిపల్లి, పాలకొండ - అమిస్తాపూర్ శివారు, రాజీవ్ స్వగృహ సమీపంలోని ప్రధాన రహదారులపై స్వాగత బోర్డులపై ఉన్న పురపాలిక పేర్లను తొలగించి మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పేరిట కొత్త స్వాగత బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలివ్వడంతో ఆ పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

» ఎస్పీ జానకి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి, అధికారులు

జడ్చర్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ జానకి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులకు పలు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలం, దాసంగాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్‌లు, సీసీ కెమెరాలు, రథాలను పరిశీలించారు. తేరును లాగే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐలు ఆలయ ట్రస్ట్ సభ్యులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్, శంకర్, జంగయ్య, గోపాల్‌యాదవ్, నారాయణ రెడ్డి, ఖదీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టు పేరుతో మోసం: బీఆర్‌ఎస్

మిడ్జిల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు ఎన్నికలప్పుడు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా వందశాతం అమలు చేయలేదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ప్రతి మండలంలో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు పేరుతో ఎంపిక చేసి మిగతా గ్రామాల ప్రజలకు ఎన్నికల కోడ్ పేరుతో మోసం చేసేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 3వ తేదీన జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో నిర్వహించనున్న మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా, జంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సుకుమార్, మతిన్, వెంకటయ్య, శ్రీనివాసులు, భాస్కర్, జగన్‌గౌడ్, విజయ్‌నాయక్, రవీంద్ర, వరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత మహబూబ్‌నగర్ లక్ష్యం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

» పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వాహనాలను జాగ్రత్తగా నడిపి ప్రమాద రహిత మహబూబ్‌నగర్ లక్ష్యంగా అందరూ నడుచుకోవాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే, ఇతర అమాయకులు బలవుతారని తెలిపారు. ఇప్పటి నుంచి హెల్మెట్ ఉంటేనే యూనివర్సిటీలోకి అనుమతి ఇచ్చే నిబంధనలు అమలు చేస్తామన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ గతేడాది మహబూబ్‌నగర్‌లో 273 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెను ప్రమాదాలు అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, అదనపు ఎస్పీ రాములు, ట్రాఫిక్ డీఎస్పీ సుదర్శన్, దీప, ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, డీటీవో రఘు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారిన సిలబస్‌కు అనుగుణంగా బోధన

మారిన సిలబస్‌కు అనుగుణంగా విద్యా బోధన చేయాలని వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శిశు సమగ్రాభివృద్ధిపై అమెరికాలోని నార్తరేడాం యూనివర్సిటీ ప్రతినిధులు రూబీనా ఫిలిప్, పాలిని ఆధ్వర్యంలో బీఈడీ అధ్యాపకులకు ఆన్‌లైన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జీవిత బీమాతో భరోసా

» ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్


ఏజెంట్‌ను సన్మానిస్తున్న చీఫ్ మేనేజర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో బీమా సంస్థలు ఎన్ని ఉన్నా ప్రజలు ఎల్ఐసీ సంస్థనే ఆదరిస్తున్నారని ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ సురేష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో 2008లో నుంచి బీమా సేకరణలో టాపర్‌గా నిలుస్తున్న గజగౌని రమేష్ గౌడ్‌ను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రమేష్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఐదుసార్లు బీమా సేకరణలో టాపర్‌గా నిలవడమే కాకుండా, మూడుసార్లు సంస్థ ఆధ్వర్యంలో అమెరికా పర్యటనకు ఎంపికయ్యాడన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఏజెంట్లు బీమా సేకరణ చేయాలన్నారు. మార్చి టార్గెట్‌లు అందరూ చేరుకోవాలని సూచించారు. ఏజెంట్లు కేవలం పాలసీ తీసుకుంటే సరిపోదన్నారు. పాలసీదారులు రెన్యూవల్ చేసుకునేలా చూడాలన్నారు. ఏబీఎం కృష్ణప్రసాద్, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


రిబ్బన్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

దేవరకద్ర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రంలోని కొత్తగా మండల పరిషత్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శివేంద్రపతాప్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. కౌకుంట్ల మండల ఏర్పాటై ఇప్పటి వరకు మండల పరిషత్ కార్యాలయం లేక ప్రజలు ఇబ్బందులు పడటంతో కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలను అందించాలన్నారు. కొత్తగా ఎంపీడీవో శివప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ కృష్ణయ్య, రాఘవేందర్‌రెడ్డి, కిషన్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం ప్రతి రాష్ట్రానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఉపాధి, విద్యా సంస్థల అభివృద్ధి ప్రణాళికలకు న్యాయం చేయాలన్నారు. పీఎఫ్ కటింగ్‌లోనే హయ్యర్ పెన్షన్ అమలు చేయాలన్నారు. మహ్మద్ యాకుబ్, మహమూద్‌అలీ పాల్గొన్నారు.